



నిండుకుండలా ఎన్టీఆర్ జలాశయం

భారీ వర్షాలు కురిసినప్పుడల్లా పెనుమూరు మండలం కలవగుంటలోని ఎన్టీఆర్ జలాశయం నిండి పొంగి పొర్లుతోంది. స్థానిక రైతులకు దక్కాల్సిన మిగులు జలాలంతా తమిళనాడు మీదుగా వెళ్లి సముద్రం పాలవుతున్నాయి. కళ్లెదుటే నీరు వృథా అవుతున్నా అడ్డుకోలేని స్థితి నెలకొంది.

- పెనుమూరు, ఆంధ్రజ్యోతి



సముద్రానికి తరలుతున్న నీరు

'జలాశయం' నిండినా రైతుకు వ్యథే..!

- సముద్రం పాలవుతున్న మిగులు జలాలు
- చెరువుల అనుసంధానం చేయకపోవడమే కారణం
- రూ.196 కోట్లకు టెండర్ దక్కినా ముందుకురాని కాంట్రాక్టర్

చిత్తూరు నగరానికి తాగునీరు అందించే లక్ష్యంతో 1995లో 0.120 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఎన్టీఆర్ జలాశయాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. వృధా అవుతున్న నీటిని స్థానిక రైతులకు అందించడానికి 20 ఏళ్లుగా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నా కార్యరూపం దాల్చడం లేదు.

చెరువులను అనుసంధానం చేస్తేనే..

ఎన్టీఆర్ జలాశయం నుంచి పెనుమూరు మండలంలోని రెండు (గంగుపల్లె, జలిజపల్లె) చెరువులకు, గంగాధరనెల్లూరు మండలంలోని మరో 31 చెరువులకు నీటిని కాలువల ద్వారా అనుసంధాన ప్రక్రియ 2004లో తెరపైకి వచ్చింది. అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చెరువులకు నీరు మళ్లించడానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

1000 ఎంసీఎఫ్‌టీల నీరు వృథా

ఎన్టీఆర్ జలాశయం ఎగువ పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ జలాశయం నిండి మిగులునీరు సముద్రం పాలవుతోంది. జలాశయం సామర్థ్యం 109.8 ఎంసీఎఫ్‌టీలు కాగా రెండు నెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయం నిండటంతో ఇరిగేషన్ అధికారులు గేట్లు తెరిచి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. 500పైగా ఎంసీఎఫ్‌టీల నీరు సముద్రం పాలయ్యిందని అంచనా. నేటికి కూడా రెండు గేట్ల ద్వారా రోజు 200 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

కాంట్రాక్టు దక్కించుకున్నా..

వైసీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ జలాశయం నుంచి 33 చెరువులకు కాలువల ద్వారా నీరు మళ్లించడానికి, మరమ్మతులు, శుభ్రత వంటి పనులకు టెండర్లను పిలిచారు. తెలంగాణకు చెందిన శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌వారు రూ.196 కోట్లకు కాంట్రాక్టు దక్కించుకున్నారు. పనులు మాత్రం మొదలుపెట్టలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఇరిగేషన్ అధికారులు ఈ పనులు జరిగేందుకు అనుమతులు కోరగా ప్రభుత్వం కూడా గతంలో టెండర్ దక్కించుకున్న వారికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే రేట్లు పెరగడంతో పనులు మొదలుపెట్టలేదని సమాచారం.

అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే థామస్

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్వహించిన మొదటి అసెంబ్లీ సమావేశంలోనే జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్.. ఎన్టీఆర్ జలాశయం నుంచి చెరువులకు నీటి అనుసంధానం, డ్రిప్ ఇరిగేషన్ ద్వారా రెండు మండలాలను సస్యశ్యామలం చేయవచ్చని ప్రస్తావించారు. దీనికి ఇరిగేషన్ మంత్రి సానుకూలంగా స్పందించారు. అయితే ఇంకా పనులు మొదలుపెట్టనందున ఎమ్మెల్యే ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించి వేల మంది రైతుల జీవితాల్లో వెలుగులు నింపాలని స్థానికులు కోరుతున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో ఇలా..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో (2014-2019) జలాశయం నుంచి పెనుమూరు మండలంలోని గంగుపల్లె, బలిజపల్లె చెరువులకు కాలువ ద్వారా నీటిని మళ్లించేందుకు టెండర్ల ద్వారా కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు.గంగుపల్లె చెరువుకు కాలువ పనులు పూర్తిచేయడంతో అందులో ఎప్పుడూ నీరు నిండుగా ఉంటుంది. బలిజపల్లె చెరువుకు కాలువ పనులను మధ్యలోనే ఆపేశారు.



రాస్తారోకో చేస్తున్న మామిడి రైతులు (ఇన్‌సెట్‌లో) రైతులతో చర్చిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు తదితరులు

మామిడికి మద్దతు ధర ఇవ్వాల్సిందే!

- మీరిచ్చే మూడు, నాలుగు రూపాయలు మాకొద్దు
- ఫ్యాక్టరీల యాజమాన్యాలపై రైతుల ఆగ్రహం
- కొత్తపల్లె వద్ద రాస్తారోకో

గుడిపాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేర్కొన్న విధంగా మామిడికి మద్దతు ధర కిలోకు రూ.8 ఇవ్వాల్సిందేనని రైతులు డిమాండ్ చేశారు. కిలోకు మీరిచ్చే మూడు, నాలుగు రూపాయలు మాకొద్దు.. కాలాతీతం చేయడం వల్ల మద్దతు ధరకు మరో రూపాయి కలిపి ఇవ్వాలంటూ మంగళవారం గుడిపాల మండలంలోని కొత్తపల్లె వద్ద ఉన్న జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు హరిబాబు చౌదరి, కార్యదర్శి ఆనందనాయుడు మాట్లాడుతూ.. జూలై నెలలో రైతు ఎన్నో అవస్థలుపడి మామిడి కాయలను ఫ్యాక్టరీలకు తోలారన్నారు. చివరకు ప్రభుత్వ ప్రకటించిన మద్దతు ధరను కూడా ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఇవ్వకుండా రైతుల కడుపు కొట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్‌నాయుడు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ రామ్మోహన్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రైతులతో చర్చించారు. ఫ్యాక్టరీల యాజమాన్యాలు, కలెక్టర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. రైతులు రవీంద్రనాయుడు, మురళినాయుడు, శేఖర్‌నాయుడు, శంకర్‌చౌదరి, చల్లా తదితరులు పాల్గొన్నారు.

అరగంటపాటు స్తంభించిన ట్రాఫిక్

రైతుల రాస్తారోకోతో సుమారు అరగంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి.

పుంజుకున్న రిజిస్ట్రేషన్ రాబడి



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ రాబడి పుంజుకుంది. అక్టోబరు, నవంబరు నెలల్లో వృద్ధిశాతం సైతం పెరిగింది. ప్రభుత్వం స్లాట్ విధానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు మంచి ముహూర్తాల రోజులు కలిసి రావడంతో ఎక్కువ మంది రిజిస్ట్రేషన్లకు మొగ్గు చూపారు. మరోవైపు కొత్త ప్రభుత్వంపై నమ్మకం పెరగడంతో స్థిరాస్తి వ్యాపారం క్రమంగా ఊపందుకుంది. భూములు, స్థలాలపై పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల కాలంలో మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో ఎనిమిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అక్టోబరు నెల రిజిస్ట్రేషన్ రాబడి లక్ష్యం రూ.13.96 కోట్లు కాగా, లక్ష్యాన్ని మించి రూ.15.89 కోట్లు వచ్చింది. అంటే సరాసరి 113.81శాతం అధికంగా ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూరింది. చిత్తూరు ఆర్వో తప్ప మిగిలిన ఏడు సబ్ రిజిస్ట్రార్(ఎస్ఆర్)లలో వందశాతం రాబడి సాధించింది. ఎస్ఆర్‌లవారీగా.. కుప్పంలో లక్ష్యానికి మించి 202.93 శాతం, నగరిలో 159, పలమనేరులో 126, కార్వేటినగరంలో 115, బంగారుపాళ్యంలో 114, పుంగనూరులో 101, చిత్తూరు రూరల్‌లో 109 శాతం అధిక ఆదాయం రాగా, చిత్తూరు ఆర్వోలో 79.68 శాతం మాత్రమే వచ్చింది. నవంబరు నెలలో రాబడి లక్ష్యం రూ. 11.17 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించగా లక్ష్యానికి మించి రూ.11.28 కోట్లు ఆదాయం సమకూరింది. నవంబరు నెలలో లక్ష్యసాధనలో చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్‌శాఖ 100.96 శాతం వృద్ధి సాధించింది. ఎస్ఆర్‌లవారీగా.. కుప్పంలో 143.25 శాతం, నగరిలో 132.56, చిత్తూరు రూరల్ 117.87, పలమనేరు 115.63 శాతం వృద్ధి సాధించగా.. మిగిలిన ఎస్ఆర్‌లలో అంతకంటే తక్కువ రాబడి వచ్చింది. గతంలో పోల్చుకుంటే రాబడి పుంజుకుందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణ మూర్తి తెలిపారు.

రైలు ఢీకొని మూగజీవాల మృత్యువాత

పూతలపట్టు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని కలికిరి కొండకు చెందిన 13 పశువులు మృతి చెందాయి. పూతలపట్టు, పెనుమూరు మండలాల పరిధిలో కలికిరి కొండపై వెంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. భక్తులు మొక్కులు తీర్చుకునే క్రమంలో దూడలు, ఆవులను కొండ వద్ద స్వామివారికి దానమిస్తుంటారు. ఆలయం వద్దకు వెళ్లే భక్తులు వీటికి భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తుంటారు. గోశాల లేకపోవడంతో ఇవి రాత్రిపూట కొండ కింద గ్రామాలకు వస్తుంటాయి. ఈనేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున పూతలపట్టు రైల్వేస్టేషన్ సమీపాన బ్రిడ్జిపై, సామనత్తం వద్ద రైలు పట్టాలపై ఆవులను ఓ రైలు ఢీకొంది. దీంతో ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి. ఆలయ అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇలాంటి సంఘటనలు జరగకుండా కొండపై గోశాల నిర్మించాలని భక్తులు కోరుతున్నారు.

నేడు 'రైతన్నా మీకోసం'

చిత్తూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రైతన్నా మీకోసం' కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 313 క్లస్టర్ రైతు సేవా కేంద్రాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి రైతన్నా మీకోసం వర్క్‌షాప్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొంటారన్నారు. రబీ పంట 2025-26, ఖరీఫ్ 2026, రబీ 2026-27 యాక్షన్ ప్లాన్, తదితర అంశాలపై రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారని వివరించారు.

నేడూ మోస్తరు వర్షం

- పెరిగిన చలితీవ్రత

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారిన కారణంగా బుధవారం కూడా జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈ మేరకు వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. మంగళవారం కూడా జిల్లా వ్యాప్తంగా ముసురుపట్టి తేలికపాటి వర్షం కురిసింది. చలితీవ్రత కూడా పెరిగింది.



సోమలలో దెబ్బతిన్న టమోటా తోట

టమోటాకు తుఫాన్ దెబ్బ

- వరి పంటకూ నష్టం
- ఆందోళనలో రైతులు



నేల వాలిన వరి పంట

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో టమోటా పంట సాగు.. రైతుల పాలిట జూదంగా మారింది. దిగుబడి ఉన్న సమయంలో ధర ఉండదు. ధర ఉంటే దిగుబడులు ఉండవు. తుఫాను దెబ్బకు పిందెలు, పూత రాలిపోతున్నాయి. మొక్కలకు తెగుళ్లు సోకడంతో నాణ్యత దెబ్బతింటోంది. ఇన్ని కష్టాలకోర్చి మార్కెట్‌కు తరలిస్తే 15కిలోల బాక్సు కేవలం రూ. 200 నుంచి రూ. 250 మాత్రమే పలుకుతోంది. నాణ్యత లేని కాయలు రూ.100లోపే కొంటున్నారు. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. పెట్టుబడి కూడా దక్కే అవకాశం లేదని వాపోతున్నారు. ఇక వరి పొలాల్లో నీటి నిల్వలతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సచివాలయాలకు సారథులు

ఇక నిరంతర పర్యవేక్షణ

కుప్పంలో 'ఈ' విప్లవం!

5లో

- ప్రారంభమైన ఈ-సైకిళ్ల రిజిస్ట్రేషన్
- జనవరి రెండో వారంలో సీఎంతో పంపిణీకి కడా కసరత్తు

ఈ-సైకిల్ నమూనా





మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల్లో లీకేజీ

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాం కాంక్రీట్ గోడల నుంచి మంగళవారం నీరు లీకేజీ అవుతోంది. డ్యాం డీఈ చంద్రమౌళిని వివరణ కోరగా.. అది సాధారణ లీకేజీ అని ఎటువంటి సమస్య లేదని చెప్పారు.

ఆలస్యంగా నడిచిన ఇండిగో విమానాలు

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షం నేపథ్యంలో మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి 10.35కు రేణిగుంటకు రావాల్సిన ఇండిగో విమానం మధ్యాహ్నం 1.20 గంటలకు వచ్చింది. 1.55 గంటలకు తిరిగి బయలుదేరింది. సాయంత్రం ముంబై నుంచి 5.20కి చేరుకోవాల్సిన విమానం 2 గంటలు ఆలస్యంగా వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు.

శ్రీవారి సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 18 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. స్వామివారికి ఆదివారం హుండీ ద్వారా రూ.3.43 కోట్ల ఆదాయం కూరింది.







పొగమంచు వాలింది.. ఇలగొంతు వణికింది..



మన రాష్ట్రంలో అత్యంత చల్లని ప్రదేశంగా లంబసింగిని పేర్కొంటారు. సముద్రమట్టానికి 3,300 అడుగుల ఎత్తులో ఉండే ఈ ప్రదేశం శీతాకాలంలో పొగమంచు కమ్మేసి ఉంటుంది. నేలకు వాలే మబ్బులు.. వణికించే చలి.. ఈ చల్లని అనుభూతి కోసం పర్యాటకులు పరుగులు తీస్తారు. సరిగ్గా ఇటువంటి వాతావరణమే తిరుమల కొండమీద గత మూడు రోజులుగా కనిపిస్తోంది. పగలు కూడా చీకటి కమ్ముకుంటోంది. లోయల్లోకి దిగిన మబ్బులతో కనుమరోడ్లు కొత్త అందాలను పంచుతున్నాయి. పొగమంచు మబ్బులు నేలకు వాలి ఆలయ పరిసరాలు మసక మసకగా మారిపోతున్నాయి. చలికి వణుకుతూనే ఈ దృశ్యాలు నేపథ్యంగా భక్తులు ఫోటోలు దిగుతున్నారు. పట్టపగలు కూడా హెడ్‌లైట్లు వేసుకునే వాహనాలు తిరుమలలో ప్రయాణించాల్సి వస్తోంది. మంచుమబ్బులతో కనువిందు చేస్తున్న శ్రీవారి పాదాలు, పాపనాశనం, పార్వేటి మండపం ప్రాంతాలను సందర్శించేందుకు భక్తులు బారులు తీరుతున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సత్యవేడులో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైంది!

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

తిరుపతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో పెత్తందారీ వ్యవస్థ ఎక్కువైందని, దీనిపై సీఎం చంద్రబాబును కలసి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నియంతృత్వ ధోరణి వద్దనుకునే తాను గతంలో పెద్దిరెడ్డిని ఎదిరించి వైసీపీ నుంచీ బయటకు వచ్చానని, ఇపుడు ఇంకో రెడ్డిని తెచ్చి తన మీద పెడతారా అని ప్రశ్నించారు. ప్రొటోకాల్ విషయమై ఇప్పటికే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేశానన్నారు. నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి పెన్షన్లు ఎలా పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చు తప్ప ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా తాను ప్రజా దర్బార్ పెడుతుంటే, శంకర్‌రెడ్డి ఎలా పెడతారని ప్రశ్నించారు. సురుటిపల్లి ఆలయ ఛైర్మన్‌గా బియ్యం దొంగను నియమించారని దీనిపై సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేస్తానన్నారు. కేవీబీపురం మండలంలో చెరువు కట్ట తెగిన ప్రమాదంలో బాధితులకు ఆశించిన స్థాయిలో సాయం అందలేదని ఆరోపించారు. చాలా విషయాలు సీఎం చంద్రబాబుకు తెలియడం లేదని, తాను నేరుగా కలసి ఆయనకు ఫిర్యాదు చేస్తానన్నారు.

పళ్లికొండేశ్వర స్వామి భక్తుల కల సాకారం

- చైర్మన్ పద్మనాభరాజు ● ఆలయ ఈవోపై ఎమ్మెల్యే బెదిరింపులకు దిగడం తగదు

నాగలాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లి పళ్లికొండేశ్వర స్వామి భక్తుల పదేళ్ల సాకారమైందని ఆలయ ఛైర్మన్ పద్మనాభరాజు మంగళవారం చెప్పారు. సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం సమన్వయకర్త కూరపాటి శంకర్‌రెడ్డి అందించిన రూ.15 లక్షలు, పిచ్చాటూరు మిల్క్ డెయిరీ ఎండీ మునిశేఖర్ నాయుడు అందజేసిన రూ.10లక్షలతో రథోత్సవానికి అడ్డంకులు తొలగాయన్నారు. రథం వెళ్లే దారిలో ఉన్న ఇంటికి ఆ డబ్బు చెల్లించి తొలగిస్తున్నామని చెప్పారు. దాతలను సన్మానించడం తమ బాధ్యతని, దీన్ని వక్రీకరించడం తగదని ఎమ్మెల్యే ఆదిమూలానికి హితవు పలికారు. ఇలాంటి ఆరోపణలతో ఆలయ పవిత్రత దెబ్బతింటుందన్నారు. తనపై ఎలాంటి కేసులు లేవని, బ్రాందీషాపు లైసెన్స్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ప్రొటోకాల్ విషయానికి వస్తే 15 రోజులకు ఒకసారి వచ్చే ప్రదోషాల ఆహ్వానంలో ఎమ్మెల్యే పేరు వేయాల్సిన అవసరం లేదన్నారు. శివరాత్రి ఉత్సవాలకు మాత్రమే ప్రొటోకాల్ వర్తిస్తుందన్నారు. దేవదాయ చట్టానికి లోబడి నడుచుకుంటున్న ఈవోపై బెదిరింపులకు దిగడం ఎమ్మెల్యేకు తగదన్నారు. పాలకమండలి సభ్యులు హంసరుద్రయ్య, కృష్ణయ్య యాదవ్, శ్రీనివాసులునాయుడు, నాగభూషణమ్మ, నెల్సన్ మండేలా, జయంతి, దేవి, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న గూడూరు జేఏసీ నేతలు

- జేఏసీ నేతల డిమాండ్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గూడూరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేయండి. లేదంటే నెల్లూరు జిల్లాలో కలపండి అంటూ జేఏసీ కమిటీ సభ్యుడు దశరధరామిరెడ్డి డిమాండు చేశారు. కలెక్టరేట్ వద్ద మంగళవారం వీరు కాసేపు ధర్నా చేశారు. ఈ విషయంలో ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. తమకు నెల్లూరు దగ్గరగా ఉంటుందని.. ఈ దిశగా సీఎం చంద్రబాబు గూడూరును ఆ జిల్లాలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగానిసత్యప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు ప్రభాకర్, శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు. ● కాగా, తిరుపతి రూరల్ దామినేడు భూములను 22ఏ నుంచి తొలగించాలని పలువురు మంత్రికి వినతిపత్రం అందించారు. తమ భూముల్లో కోర్టు కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తమకు న్యాయంచేయాలంటూ మరికొందరు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు శ్రీవారిసేవకులు

- 'ట్రైయిన్ ద ట్రైనీస్' శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో




తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సేవకులు హిందూ ధర్మానికి బ్రాండ్ అంబాసిడర్లు అని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని సేవాసదన్-2లో మంగళవారం మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు శ్రీవారిసేవను మరింత బలోపేతం చేయడం కోసం 'ట్రెయిన్ ద ట్రైనీస్' పేరుతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు ఈవో చెప్పారు. ఇక్కడ శిక్షణ పొందిన గ్రూప్ సూపర్వైజర్లు (మాస్టర్ ట్రైనర్లు) పేర్లు నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే ఆయా ప్రాంతాల్లో శిక్షణ ఇస్తారని వివరించారు. నమోదు చేసుకున్న శ్రీవారి సేవకులకు సేవకు రాకమునుపే శిక్షణ అందించి వారిని భక్తులకు ఉన్నతమైన సేవలు అందించేలా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఏపీ ప్రణాళికా విభాగం, ఐఐఎం-అహ్మదాబాద్ నిపుణులు శిక్షణ మాడ్యూల్‌ను రూపొందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పండితులు మేడసాని మోహన్, దామోదర్ నాయుడు, శ్రీనివాస్, చీఫ్ పీఆర్వో రవి, పీఆర్వో నీలిమ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

బొమన్ సాబ్ లుక్

ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాజాసాబ్'. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. జనవరి 9న విడుదలవుతోంది. ఈ చిత్రంలో అతీంద్రియ శక్తుల పరిశోధకుడిగా బాలీవుడ్ నటుడు బొమన్ ఇరానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. మంగళవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. హారర్ కామెడీ జానర్‌లో ఎవర్‌గ్రీన్ మూవీగా నిలిచిపోయేలా 'రాజా సాబ్'ను రూపొందిస్తున్నారు దర్శకుడు మారుతి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ ఈ చిత్రంలో హీరోయిన్లుగా నటిస్తున్నారు.



కథను మలుపుతిప్పే పాత్ర పోషించాను



- సంయుక్త

'అఖండ 2: తాండవం' చిత్రంలో అవకాశం వచ్చినప్పుడు నేను చాలా బిజీగా ఉన్నాను. ఒక మంచి సినిమాలో అవకాశం వస్తే తిరస్కరించకూడదు అని భావించి డేట్స్ అడ్జెస్ట్ చేసుకొని నటించాను. ఈ సినిమాలో కథను మలుపు తిప్పే పాత్ర పోషించాను' అని సంయుక్త అన్నారు. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అఖండ 2: తాండవం'. నందమూరి తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించారు. ఈ నెల 5న విడుదలవుతోంది. ఈ సందర్భంగా కథానాయిక సంయుక్త సినిమా విశేషాలను మీడియాతో పంచుకున్నారు.

- "అఖండ 2: తాండవం' చిత్రం 'అంచనాలకు మించి ఉండబోతోంది. బోయపాటి గారు గ్రేట్ విజన్‌తో తెరకెక్కించారు. విజువల్స్ అద్భుతంగా ఉంటాయి.
- ఈ చిత్రంలో నా పాత్ర చాలా కీలకంగా, స్టైలిష్‌గా ఉంటుంది. నా కెరీర్‌లో తొలిసారి ఓ మాస్ సాంగ్ చేశాను. ఇలాంటి మాస్ సాంగ్ ఇప్పటివరకూ చేయలేదు. చాలా కష్టపడ్డాను. ప్రాక్టీస్ చేసే సమయంలో మోకాలు దెబ్బతిని సహకరించకపోవడంతో ఫిజియోథెరపీ చేయించుకున్నా.
- బాలకృష్ణ గారు దర్శకుల నటుడు. వారు ఎలా చెబితే అలా చేస్తారు. నటుడిగానూ ఆయన విజన్ అద్భుతం. సెట్‌లో ఆయన చాలా స్నేహంగా ఉండేవారు. ఆయన నటించిన 'డాకూ మహరాజ్' నా ఫేవరేట్ చిత్రం.
- తమన్ సంగీతం, ముఖ్యంగా సంస్కృత శ్లోకాలతో సాగే నేపథ్య సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది. మా నిర్మాతలు రామ్, గోపీ గారు మేకింగ్‌లో రాజీ పడలేదు. సినిమాను ప్రేక్షకులకు చేరువ చేసేందుకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కథానాయికగా స్వయంభు, నారీ నారీ నడుమ మురారి చిత్రాలు చేస్తున్నాను.

అఖండ 2 టికెట్ ధరల పెంపు

- ఏపీ ప్రభుత్వ అనుమతి

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2' సినిమా టికెట్ ధరల పెంపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం అనుమతిచ్చింది. ఈ నెల 5న ఈ చిత్రం విడుదలవుతోంది. నిర్మాతల వినతి మేరకు భారీ బడ్జెట్ సినిమాలకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి జారీ చేస్తోంది. అందులో భాగంగానే ఈ సినిమా విడుదలైన తొలి పది రోజులు టికెట్ ధరలు పెంచుకునేందుకు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు పూర్తి అనుమతి లభించింది. సింగిల్ స్క్రీన్లలో సాధారణ రేటుపై రూ. 75, మల్టీప్లెక్స్‌ల్లో రూ. 100 పెంపునకు అనుమతించింది. ఈ నెల నాలుగున ప్రదర్శించే ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 600గా నిర్ణయించారు.

విందు భోజనంలా ఎంజాయ్ చేసే సినిమా



క్రికెట్ క్రీడ నేపథ్యంలో కామెడీ ప్రధానాంశంగా రూపుదిద్దుకున్న చిత్రం 'గేట్'. సుడిగాలి సుధీర్, దివ్యభారతి జంటగా నటించారు. ఎం. చంద్రశేఖర్ నిర్మించారు. మంగళవారం నిర్మాత దిల్‌రాజు టీజర్‌ను విడుదల చేసి, యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 'అడ్డంకులను దాటుకొని ఈ సినిమాను అద్భుతంగా తీర్చిదిద్దాం. మంచి అభిరుచితో చేసిన సినిమా ఇది. ప్రేక్షకులు విందు భోజనంలా ఎంజాయ్ చేస్తారు. మణిశర్మ నేపథ్య సంగీతం సినీ ప్రియులను మెప్పిస్తుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం' అని చెప్పారు. సహ నిర్మాత రవీందర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ సినిమాను మాస్ ఎంటర్‌టైనర్‌గా తీశాం. చంద్రశేఖర్ రెడ్డి ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు' అని తెలిపారు. ఆద్యంతం వినోదం పంచే చిత్రమిదని దివ్యభారతి తెలిపారు.

యువతకు కనెక్ట్ అయ్యే కథ



రివేంజ్ స్టోరీతో సాగే థ్రిల్లింగ్ ప్రేమకథా చిత్రం 'సైక్ సిద్ధార్థ్'. శ్రీనందు, యామిని భాస్కర్ జంటగా నటించారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీనందు, శ్యామ్ సుందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా శ్రీనందు మాట్లాడుతూ 'ఇప్పుడున్న సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథతో తెరకెక్కిన చిత్రమిది. సురేశ్‌బాబు గారు సినిమా చూసిన వెంటనే పంపిణీ చేసేందుకు అంగీకరించారు. సురేశ్ ప్రొడక్షన్స్ ఈ సినిమాను తీసుకోవడంతో నా కల నెరవేరినట్లయింది' అని చెప్పారు. వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ 'ప్రచార చిత్రాలకు చక్కని ప్రేక్షకాదరణ దక్కింది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేసే చిత్రమిది. తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా స్ర్కీన్‌ప్లేలో చాలా మార్పులు చేశాం' అని చెప్పారు.

అనుమాన పక్షి వచ్చేది అప్పుడే



రాగ్ మయూర్, మెరిన్ ఫిలిప్ జంటగా 'డీజే టిల్లు' ఫేమ్ విమల్ కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అనుమాన పక్షి'. చిలక ప్రొడక్షన్స్‌పై రాజీవ్ చిలక, రాజేశ్ జగ్గియాని, హీరాచంద్ దండ్ నిర్మిస్తున్నారు. తాజాగా సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ ఓ వీడియోను షేర్ చేశారు మేకర్స్. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుందని తెలిపారు. వినోద ప్రధానంగా సాగే ఈ సినిమా విమల్ కృష్ణ మార్క్‌తో స్టైలిష్‌గా ఉండనుందని చెప్పారు. రాగ్ మయూర్ పాత్ర చాలా విభిన్నంగా ఉంటుందని పేర్కొన్నారు. అతిగా ఆలోచిస్తూ, అతి జాగ్రత్తతో ఉండే ఆయన రోల్ ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాక, కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ అన్నారు. బ్రహ్మాజీ, ప్రిన్స్ సెసిల్, అనన్య, చరిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డీఓపీ: సునీల్‌కుమార్ నామా, సంగీతం: శ్రీచరణ్ పాకాల.

ప్రేమ కోసం యుద్ధం



రోషన్ కనకాల, సాక్షి మడోల్కర్ జంటగా 'కలర్ ఫొటో' ఫేమ్ సందీప్ రాజ్ తెరకెక్కించిన చిత్రం 'మోగ్లీ 2025'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతోంది. మంగళవారం చిత్రం ట్రైలర్‌ను హీరోయిన్ రష్మిక మందన్న విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్‌లో పాత్రలను, కథా నేపథ్యాన్ని పరిచయం చేసిన విధానం ఆకట్టుకుంది. 'తన ప్రేమ కోసం యుద్ధం చేసే ప్రతీవాడు హీరోనే' అంటూ కథానాయకుడు పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. బండి సరోజ్‌కుమార్ ఈ సినిమాలో విలన్‌గా నటించారు. హర్ష చెముడు కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామ మారుతి ఎమ్, సంగీతం: కాలభైరవ.

కాంతారపై కామెడీ



రణ్‌వీర్ క్షమాపణలు

కాంతార చిత్రంపై తాను చేసిన వ్యాఖ్యలకు బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. ఎవరినీ కించపరచడం తన ఉద్దేశం కాదని తెలిపారు. 'రిషబ్ శెట్టి బాగా నటించారని చెప్పడం కోసమే నేను అలా నటించాను. అలాంటి సన్నివేశాల్లో నటించాలంటే చాలా కష్టం. అయినా ఏ ఇబ్బంది లేకుండా అటువంటి సన్నివేశాలను ఎంతో ఈజీతో చేసే ఆయనంటే నాకు చాలా ఇష్టం. మన దేశంలోని ప్రతీ సంప్రదాయం మీద నాకు అపారమైన గౌరవం ఉంది. నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధపెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొన్నారు. 'కాంతార'పై రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై హిందూ జనజాగృతి సమితి ఫిర్యాదు చేసింది. ఆయన చేసిన కామెంట్స్ హిందువుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని పేర్కొంది. గోవాలో ఇటీవలె ముగిసిన ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) వేడుకల్లో రణ్‌వీర్ 'కాంతార' చిత్రంపై చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. వేదికపై మాట్లాడుతూ "కాంతార' సినిమాలో రిషబ్ శెట్టి నటన అద్భుతం. హీరో పాత్రలోకి దెయ్యం ప్రవేశించినప్పుడు వచ్చే సన్నివేశాలు చాలా బాగున్నాయి" అని రణ్‌వీర్ పేర్కొన్నారు. ఆ సినిమాలో ఎంతో పాపులర్‌గా మారిన 'ఓ' అనే శబ్దాన్ని స్టేజీపై అనుకరించారు. దేవతను ఆయన దెయ్యంగా పోల్చాడని కర్ణాటక వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేశారు.

వినూత్నంగా వన్ బై ఫోర్



నూతన నటీనటులతో సరికొత్త తరహాలో తెరకెక్కిన కామెడీ థ్రిల్లర్ 'వన్ బై ఫోర్'. వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్ జంటగా నటించారు. బాహుబలి పళని కె. దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ సంయుక్తంగా నిర్మించారు. ఈ నెల 12న విడుదలవుతోంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ 'కొత్త తరహా కథాంశంతో ఈ క్రైమ్ డ్రామాను తీశాం. పళని గారి టేకింగ్ సినిమాకు ప్రత్యేకాకర్షణ. హారర్, సస్పెన్స్ అంశాలు, పోరాట ఘట్టాలు చాలా బావుంటాయి' అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ అంశాలతో పాటు మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రమిది. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్' అని చెప్పారు. కథ మీద నమ్మకంతో ఈ చిత్రాన్ని నిర్మించాం, ప్రేక్షకులు ఆశించే అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది అని నిర్మాతలు తెలిపారు.

విడుదలకు సిద్ధం



భాస్కర్, కోటేశ్వర రావు ప్రధాన పాత్రధారులుగా తెరకెక్కిన చిత్రం 'విధాత'. మణికంఠ రాజేంద్రబాబు దర్శకత్వంలో అప్పిని పల్లె భాస్కర చారి నిర్మించారు. విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మణికంఠ రాజేంద్రబాబు మాట్లాడుతూ 'ఇదో వైవిధ్యభరితమైన చిత్రం. పాత్రలన్నీ సహజ సిద్ధంగా ఉంటాయి' అని అన్నారు. 'ఓ యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించాము' అని అప్పిని పల్లె భాస్కర చారి తెలిపారు.

సచివాలయాలకు సారథులు

● ఇక నిరంతర పర్యవేక్షణ



చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ వ్యవస్థలో జవాబుదారీతనం తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో సుమారు 4,369 మంది వరకు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని పర్యవేక్షించే అధికారితోపాటు, వారికి జాబ్‌చార్ట్ లేకపోవడంతో 50 శాతం మందికిపైగా ఉద్యోగులు బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మండలానికి ఒకరు చొప్పున ప్రత్యేకాధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ మూడ్రోజుల కిందట నియమించారు. 31 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమించాల్సి ఉండగా.. వీరిలో నలుగురు ఆసక్తి చూపని కారణంగా 27మంది మాత్రమే విధుల్లో చేరారు.

జిల్లా వివరాలు	
మండలాలు:	31
పంచాయతీలు:	697
గ్రామ సచివాలయాలు:	504
వార్డు సచివాలయాలు:	108
డిప్యూటీ ఎంపీడీవోలు:	27 మంది

జవాబుదారీతనం పెంచేలా..

పంచాయతీరాజ్‌లో గ్రేడ్-1 కార్యదర్శులు, సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలుగా పనిచేసిన వారికి పదోన్నతులు కల్పించి డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. ● గతంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన ఉద్యోగి సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విరమణ చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలతో పదోన్నతి విధానం పూర్తిగా మారింది. గతంలో ఉన్న ఈవోపీఆర్డీ పోస్టును డిప్యూటీ ఎంపీడీవోగా మార్చారు. తాజాగా వీరికి అదనంగా సచివాలయ పర్యవేక్షణకు మరో డిప్యూటీ ఎంపీడీవోను నియమించారు. ● జాబ్‌చార్ట్ ప్రకారం గ్రామ, వార్డు స్థాయి అభివృద్ధి ప్రణాళిక పనుల్లో పాల్గొనాలి. ప్రభుత్వ పథకాల అమలు, వాటి విస్తరణ కార్యక్రమాలు చేపట్టాలి. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పౌరుల సమాచారం సేకరించాలి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, ఇంటింటికి తీసుకెళ్లాలి. విపత్తు సమయంలో అత్యవసర సేవలు అందించాలి. సచివాలయాల ద్వారా మండల కేంద్రానికి వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి.



తవణంపల్లెలో బాధ్యతలు తీసుకున్న డిప్యూటీ ఎంపీడీవో ప్రభుకిరణ్

ప్రతి మండలానికి ప్రత్యేక అధికారి

ప్రతి మండలానికీ ఓ ప్రత్యేకాధికారిని ప్రభుత్వం నియమించింది. దీనివల్ల ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెరుగుతుంది. పథకాలు, సచివాలయాల వారీగా అర్హులందరికీ అందుతాయి. డిప్యూటీ ఎంపీడీవోలుగా చేరిన వారికి త్వరలో శిక్షణ ఉంటుంది.

- రవికుమార్, జిల్లా సమన్వయకర్త, గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ

వాన పండుగ



తీయదనాన్ని ఆస్వాదిస్తూ..



ముసురువీడేనా.. నింగికెగిరేనా..



పండు రంగులో కలిసిపోయాను కదూ..



ఆహారం కోసం విహం'గాలం'



చిరు జల్లుల 'పూల'కింత...



నిలిచేనా... జారేనా....

చినుకు రాలితే ప్రకృతికి పండుగ. గుట్టా చెట్టూ, పిట్టా పురుగూ.. సమస్తమూ పరవశిస్తాయి. గుంటా చెరువూ జలకళలాడుతాయి. పచ్చదనం పురివిప్పుకుంటుంది. దిత్వా తుఫాను కురిపిస్తున్న ముసురువానలకు ఎటు చూసినా అందాలు కనువిందు చేస్తున్నాయి. ఆకులమీద చినుకుముత్యాలు.. తడి రేకులు విప్పుకుని సిగ్గులుపోయే పూలు.. పూల తేనెలు జుర్రుకునే బుల్లిపిట్టలు.. ఆకాశయానాలు చేసే విహంగాలు.. బురదనీటిలో తిండిని వెతుక్కునే కొంగలూ.. చిత్తూరు గంగినేనిచెరువు పరిసరాల్లో మంగళవారం కనిపించిన దృశ్యచిత్రాలు ఇవి..

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, చిత్తూరు



కుప్పంలో 'ఈ' విప్లవం!

● ప్రారంభమైన ఈ-సైకిళ్ల రిజిస్ట్రేషన్

● జనవరి రెండో వారంలో సీఎంతో పంపిణీకి కడా కసరత్తు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గమైన కుప్పం రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచే క్రమంలో ఒక్కో అడుగు ముందుకు వేస్తోంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతోపాటు పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య సంరక్షణ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడానికి 'ఈ' విప్లవానికి నాంది పలుకుతోంది. ఇందులో భాగంగా పెడల్ (ప్రమోటింగ్ ఈ-బైసికల్స్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ లైవ్‌లిహుడ్) పేరుతో ఎలక్ట్రిక్ సైకిళ్లను ఇప్పటికే నియోకవర్గ ప్రజలకు పరిచయం చేసిన కడా (కుప్పం డెవలప్‌మెంట్ అథారిటీ), మరికొన్ని సైకిళ్లకోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించింది. జనవరి మొదటి వారంలో కుప్పంలో పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జిల్లా వ్యాప్తంగా ఒకేసారి ఏకంగా 10వేల ఈ-సైకిళ్ల పంపిణీకి కసరత్తు చేస్తోంది. కుప్పం నియోజకవర్గానికి అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు క్యూ కడుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే సుమారు 10కిపైగా వివిధరకాల కంపెనీలు తమ ప్రాథమిక కార్యకలాపాలను (భవన నిర్మాణాలు, ఇతర ప్రాథమిక చర్యలు)ను ప్రారంభించాయి. ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కంపెనీ అయిన ఈ-రాయిస్ కుప్పంలో ప్లాంటు స్థాపనకు స్థలం పొంది, కడాతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది. కార్పొరేట్ సంస్థల సామాజిక బాధ్యతలో భాగంగా 100కుపైగా ఈ-ఆటోలను ఉచితంగా ఈ కంపెనీ పంపిణీ చేసింది. వీటిని కుప్పం మున్సిపాలిటీతోపాటు, నాలుగు మండలాల్లోని పంచాయతీలకు కేటాయించారు. ఇదికాక కడా ఆధ్వర్యంలో సుమారు ఒక్కోటీ రూ.30వేల విలువచేసే 400 ఈ-సైకిళ్లను కేవలం రూ.9,400లకు వెలుగు ప్రాజెక్ట్ ద్వారా చిరు వ్యాపారులకు ఇప్పటికే పంపిణీ చేశారు.



పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా..

కుప్పంలో అనేకానేక పరిశ్రమలు తమ ప్రాథమిక కార్యకలాపాలు ప్రారంభించిన నేపథ్యంలో వాతావరణ కాలుష్యం మితిమీరిపోకుండా అదుపులో ఉంచడానికి సమాంత ప్రక్రియను కడా ప్రారంభించింది. ఇందులో భాగంగానే కడా పీడీ వికాస్ మర్మత్, పలు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలతో మాట్లాడి ఈ-సైకిళ్ల పంపిణీకోసం ఒప్పందం కుదుర్చుకున్నారు. పెడల్ అనే పేరుతో ఈ పథకాన్ని అమలు చేయడానికి కసరత్తు నడుస్తోంది. రూ.34,999 విలువచేసే ఈ-సైకిల్‌ను కేవలం రూ.23,999కే సరఫరా చేయడానికి ఈ-మోటోరాడ్ అనే సంస్థ ముందుకొచ్చింది. పురుషులు, మహిళలు అనే తేడా లేకుండా అన్నిరకాలైన చిరు వ్యాపారాలు చేసుకునే వారందరూ ఈ సైకిళ్లు పొందడానికి అర్హులే. ఒకేసారి కూడా మొత్తం నగదును చెల్లించాల్సిన అవసరం లేదు. డౌన్ పేమెంట్‌గా కేవలం రూ.5వేలు చెల్లించి ఈ-సైకిల్ కోసం కడా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. తర్వాత 4 వాయిదాల్లో మిగిలిన మొత్తాన్ని చెల్లించే వెసులుబాటు కల్పించారు. డౌన్ పేమెంట్ రూ.5వేలు పోను, ఆరు నెలల వాయిదా అయితే నెలకు ఈఎంఐ రూ.3,306 వంతున రూ.19,836 చెల్లించాల్సి ఉంటుంది. 12 నెలలైతే రూ.1,699 వంతున రూ.20,388, 24 నెలలైతే రూ.899 వంతున రూ.21,576 చెల్లిస్తే సరిపోతుంది. తద్వారా కేవలం కొనుగోలుదారులకు కేవలం 11.5 శాతం మాత్రమే వడ్డీ రేటు పడుతుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ నడుస్తోంది. ఈ-సైకిల్ కావాలనుకున్నవారు తమ ఆధార్‌కార్డు, చేస్తున్న చిరు వ్యాపారం వివరాలతో కడా కార్యాలయాన్ని సంప్రదిస్తే వారి పేర్లను రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ-సైకిల్ వాడకం ద్వారా పర్యావరణ పరిరక్షణ లక్ష్యం నెరవేరుతుంది. అంతేకాక సైకిల్‌ను ఎలక్ట్రిసిటీ లేకుండా నడపాలనుకుంటే సాధారణమైన సైకిల్ లా తొక్కుకుని వెళ్లవచ్చు. తద్వారా ప్రజలకు ఆరోగ్య సంరక్షణ భాగ్యం కూడా దక్కుతుంది.



కుప్పం మున్సిపాలిటీకి కేటాయించిన ఈ-ఆటోలు (ఫైల్‌ఫొటో)

సీఎం చంద్రబాబు చేతులమీదుగా..

జిల్లా మొత్తం మీద 10వేల ఈ-సైకిళ్ల సరఫరాకు ఒప్పందం కుదిరితే, అందులో ఒక్క కుప్పం నియోజకవర్గానికే 5వేల సైకిళ్లను కేటాయించారు. జనవరి రెండో వారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన ఖరారైనట్లు తెలిసింది. దాదాపు జనవరి 9, 10 తేదీల్లో సీఎం పర్యటన ఉంటుందని కడా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆ సమయంలో కుప్పంలో పెద్దయెత్తున ఈ-సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చేతులమీదుగా చేయించాలని నిర్ణయించారు. ఒకేసారి 10వేల ఈ-సైకిళ్లను పంపిణీ చేయడం ద్వారా రికార్డు సృష్టించాలన్న సంకల్పంతో కడా పీడీ వికాస్ మర్మత్ ఉన్నారు. ఆ దిశగా ప్రస్తుతం కసరత్తు నడుస్తోంది.

రాష్ట్రాన్ని ఆదుకోండి

● కేంద్రమంత్రి అమిత్ షాకు మంత్రులు, ఎంపీల వినతి



మంత్రులతో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకోవాలని కేంద్రమంత్రి అమిత్ షాను ఏపీ మంత్రులు కోరారు. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో హోంమంత్రి అనిత, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, సహచర ఎంపీల బృందంతో కలసి ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అమిత్ షాను మంగళవారం ఢిల్లీలో కలిశారు. మొంథా తుఫాన్ కారణంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని విన్నవించారు. అన్ని రంగాలకు సంబంధించిన రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని వివరించామని ఎంపీ తెలిపారు.

ఆ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలి: సీపీఐ



సమావేశంలో ప్రసంగిస్తున్న కోదండయ్య

నగరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నిండ్ర, విజయపురం, నగరి మండలాలను తిరుపతి జిల్లాలో కలపాలని నగరి నియోజకవర్గ సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కోదండయ్య ప్రసంగించారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ఈ మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారన్నారు. వివిధ అవసరాలకు ఇక్కడి ప్రజలు తిరుపతిపై ఆధారపడుతున్నారన్నారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కూడా పలుసార్లు సానుకూలంగా స్పందించారన్నారు. అయినా ఇందుకు భిన్నంగా నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. సమావేశంలో బాషా, మురళి, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, సరవుద్దీన్, ఆర్ముగం, ఏకుమలై, ఏసయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



గాయత్రి మృతదేహం

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో గాయత్రి (37), యువరాజ్ దంపతులు నివాసముంటున్నారు. గాయత్రి ఓ ప్రైవేటు స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తుండగా.. యువరాజ్ కుప్పం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా ఉన్నాడు. సుమారు 13 ఏళ్ల క్రితం వివాహమైన వీరికి శశాంక్ అనే కుమారుడున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఇంట్లోనే గాయత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం వద్ద పోలీసులకు ఒక సూసైడ్ లెటర్ దొరికింది. కుమారుడిని, కుటుంబాన్ని ఉద్దేశించి రాసిన ఆ లెటర్‌లో 'ఐయామ్ సారీ శశాంక్, ఐయామ్ వెరీ సారీ మై డియర్ ఫ్యామిలీ మెంబర్స్. నా చావుకు ఎవరూ కారణం కాదు' అని ఇంగ్లిషులోను, తెలుగులోను రాసి ఉంది. కుటుంబ కలహాలే గాయత్రి ఆత్మహత్యకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

పెద్దపంజాణి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు పలమనేరు డీఎస్పీ ప్రభాకర్ తెలిపారు. పెద్దపంజాణి మండలం శ్రీరామాపురం సమీపంలోని బసాపురం క్రాస్ వద్ద గంజాయి తరలిస్తున్న శంకర్రాయలపేట గ్రామానికి చెందిన మస్తాన్, పుంగనూరు మండలం భగత్‌సింగ్ కాలనీకి చెందిన శివ భార్య శ్యామలను తహసీల్దారు హనుమంతు, ఎస్‌ఐ మారెప్ప తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. సుమారు రూ.31,500 విలువైన రెండు కిలోల వంద గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. గంగవరం సీఐలు మురళీమోహన్, పరశురాముడు పాల్గొన్నారు.

ఎస్బీఐలో చోరీకి విఫలయత్నం

విజయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయపురం మండలం పన్నూరులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) బ్రాంచిలో దుండగులు చోరీకి యత్నించారు. ఈమేరకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ మహేష్‌బాబు తెలిపారు. సోమవారం అర్ధరాత్రి బ్యాంకులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేసినట్లు గుర్తించామన్నారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మండలంలో వ్యవసాయ మోటారు కేబుళ్లు, స్టార్టర్లు తరచూ దొంగిలిస్తున్నారు. ఈసారి బ్యాంకులో దొంగతనానికి తెగబడ్డారని తెలిసి స్థానికులు ఉలిక్కిపడ్డారు.

వానలో.. అడవిలో.. 36 గంటలు

● బత్తినయ్యకోనకు వెళ్లి చిక్కుకుపోయిన భక్త బృందం

● స్థానికుల సాయంతో కాపాడిన రెవెన్యూ, పోలీసులు

ఏర్పేడు మండలం బత్తినయ్యకోనకు వెళ్లి శ్రీకాళహస్తికి చెందిన 22 మంది భక్తులు 36 గంటలపాటు అడవిలో చిక్కుకుపోయిన సంఘటన ఆందోళనకు గురి చేసింది. ఆదివారం బయలుదేరిన వీరు మంగళవారం సాయంత్రం దాకా కూడా తిరిగి రాకపోవడంతో అందరూ ఆందోళన చెందారు. వానలకు ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వాగును దాటలేక, అడవిలో దారి తెలియక, సెల్ ఫోన్లు పనిచేయక, తిండికూడా లేక పసిబిడ్డలు మొదలు ముసలివాళ్ల దాకా విలవిలలాడిపోయారు. ముసలిపేడు స్థానికుల ధైర్యసాహసాలు, రెవెన్యూ, పోలీసుల సహకారంతో వీరంతా మంగళవారం రాత్రికి సురక్షితంగా అడవి దాటి బయటకు వచ్చారు. ఈ సంఘటనలన్నీ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలా సాగాయి.





బత్తినయ్యకోన నుంచి టార్చిలైట్ సాయంతో అడవిలో వస్తున్న భక్తులు - వృద్ధురాలిని జోలి కట్టి తీసుకొస్తున్న స్థానికులు

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం బత్తినయ్య కోనలోని భక్తకంఠేశ్వర ఆలయంలో సోమవారం రాత్రి నిద్ర చేస్తే పుణ్యం వస్తుందని భక్తుల నమ్మకం. శ్రీకాళహస్తికి చెందిన 45 మంది ఆదివారం ట్రాక్టర్‌లో ముసలిపేడుకు చేరుకున్నారు. ఆ రాత్రి అక్కడే పడుకుని, తెల్లవారుజామునే నడక మొదలు పెట్టారు. సోమవారం ఉదయం బత్తినయ్య కోనకు చేరుకున్నారు. పూజలు చేసుకుని 23మంది సోమవారం సాయంత్రానికి తిరిగి వచ్చేశారు. కార్తీక సోమవారం రాత్రి భక్తకంఠేశ్వరస్వామి సన్నిధిలో నిద్రిస్తే మంచిదని మిగిలిన 22మంది అక్కడే ఉండిపోయారు. మంగళవారం ఉదయం లేచి కొండ దిగడం మొదలు పెట్టారు. ఒకవైపు వాన.. మరోవైపు చలి.. దారిలో పంబ కాలువ ఉధ్రుతంగా ప్రవహిస్తుండటంతో దాట లేకపోయారు. ఫోన్లు పనిచేయకపోవడంతో ఇళ్లకు సమాచారమిచ్చే వీలు లేకపోయింది. సాయంత్రం అవుతున్నా వాగు ఉధ్రుతి తగ్గలేదు. ఆకలి.. భయం.. ఆందోళన పెరిగిపోయాయి. నిజానికి వాగు దాటకుండా అడవిలో నడిచి బత్తినయ్య గిరిజనకాలనీకి చేరుకునే వీలుంది. వీరికి ఆ అడవిమార్గం తెలియలేదు. వీరిలో జంగం దేవర కుమారుడి ఫోన్ ఒక తావులో పనిచేయడంతో ముసలిపేడుకి సమాచారం ఇచ్చాడు. ముసలిపేడువాసులు ఏర్పేడు రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ముసలిపేడు గ్రామానికి చేరుకున్నారు. స్థానికుల సహకారంతో సహాయక చర్యలు చేపట్టారు. భక్తులు చిక్కుకుపోయిన వాగు వద్దకు చేరుకున్నారు. ఎక్స్‌కవేటర్‌సాయంతో అధికారులు కాలువను దాటడానికి ప్రయత్నించినా నీటి ఉధ్రుతి పెరుగుతూనే ఉండడంతో సాధ్యం కాలేదు. ఈ క్రమంలో నలుగురు స్థానికులు సాహసించి తాడు సాయంతో కాలువ దాటి అవతలకు వెళ్లారు. అప్పటికే చిక్కుకుపోయిన వారు తిండిలేక నీరసించిపోయి ఉన్నారు. వారిని అడవిదారిలో బత్తినయ్య గిరిజనకాలనీకి తీసుకువచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలిని జోలిలో కిందకు మోసుకువచ్చారు. 22 మందికీ పాపానాయుడుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యపరీక్షలు చేశారు. కోన నుంచి ముసలిపేడుకు చేరుకున్న భక్తులకు టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు, మనోహర్‌నాయుడు, అంకయ్య ఆధ్వర్యంలో భోజనం అందించారు. అక్కడ్నుంచి సురక్షితంగా ఇళ్లకు చేర్చారు. తమను కాపాడిన అధికారులకు, ముసలిపేడు వాసులకు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.



భక్తులను పలకరిస్తున్న అధికారులు

రేపు, ఎల్లుండి వెటర్నరీలో పీజీ విద్యార్థుల జాతీయ సదస్సు

తిరుపతిరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ కళాశాల వేదికగా గురు, శుక్రవారాలు రెండురోజుల పాటు పీజీ విద్యార్థుల రెండవ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ, అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య వెల్లడించారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పశువైద్య శాస్త్రంలో పరిశోధన -నూతన ఆవిష్కరణలు, పశువుల ఆరోగ్యం -ఉత్పాదన ప్రభావం అనే అంశాలపై ఈసదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. పీజీ, డాక్టరల్, యూజీ (ఫైనలియర్) విద్యార్థుల సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణల ద్వారా పశువుల్లో వచ్చే వ్యాధులను తగ్గించడం, తద్వారా పాలు, మాంస ఉత్పత్తుల పెంపుతో జాతీయ స్థూల ఉత్పత్తిని పెంచడమే ఈసదస్సు లక్ష్యమని వివరించారు. ఈ సదస్సుకు 8 రాష్ట్రాలకు చెందిన పశువైద్య విద్యార్థులు హాజరై పరిశోధనా పత్రాలు సమర్పిస్తారని తెలిపారు. మొత్తంగా 6అంశాలపై చర్చలు ఉంటాయని, ఉత్తమ ప్రతిభచాటిన వారికి అవార్డులు ప్రదానం చేస్తామని చెప్పారు. యూజీ ఫైనలియర్ విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహించి ప్రతిభచాటిన మూడు జట్లకు అవార్డులు అందించనున్నట్లు వెల్లడించారు. వెటర్నరీసైన్స్ డీన్ డాక్టర్ ఆర్వీసురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగే సదస్సుకు ముఖ్యఅతిథిగా చెన్నైకి చెందిన ప్రకాశ్‌ఫుడ్స్ ఛైర్మన్ డాక్టర్ డీవీఆర్ ప్రకాశ్‌రావు, గౌరవఅతిథిగా విశాఖకి చెందిన ఆంకో సీక్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ పూసల సురేష్, వర్సిటీ వీసీ డాక్టర్ జేవీరమణ, డీఆర్ డాక్టర్ సీహెచ్ శ్రీలత, జీవోటీఎస్ సంస్థ ఛైర్మన్ డాక్టర్ కిశోర్ ప్రయాగ హాజరవుతారని తెలిపారు. డాక్టర్ బి.రాంబాబునాయక్, కోఆర్గనైజింగ్ సెక్రటరీలు సుధీర్, మురళీధర్, చైతన్యకుమార్, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌తో స్థలాలు..
భవనాలపై శాశ్వత హక్కు!

- అనధికార లే అవుట్లను క్రమబద్ధీకరించుకోండి
- పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్.ఆర్.ఎస్. (అనధికార లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం) వినియోగించుకోవాలని పలమనేరు కుప్పం మదనపల్లె అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీకేఎం ఉడా) చైర్మన్ డాక్టర్ బీఆర్.సురేశ్ బాబు, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావులు ప్రజలను కోరారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం వారు రియల్టర్లు, ప్రజలు, కౌన్సిలర్లతో సమావేశమై ఈ పథకం గురించి వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 2025 జూన్ 30వ తేదీ కంటే ముందు రిజిస్ట్రేషన్ జరిగిన అనధికార లే అవుట్‌తోపాటు అనధికార లే అవుట్‌లో భాగంగా ఉన్న ప్లాటు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలా చేసుకుంటే ఆయా లే అవుట్లు, ప్లాట్లపై చట్టబద్ధమైన శాశ్వత హక్కు దక్కుతుందన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం కోసం 2026 జనవరి 23 తేదీలో పు దరఖాస్తు చేసుకోవాలని, లేకుంటే వినియోగించుకుని అధికారికంగా అప్రూవల్ పొందని అనధికార లే అవుట్లు, ప్లాట్లపై తగు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్ పథకం గురించిన వివరాలు ఇవీ.

మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీలలో 30-06-2025కు ముందు వేసిన అనధికార లే అవుట్లలోని ప్లాట్లు, నిర్ణీత అపరాధ రుసుంతోపాటు 7 శాతం ఓపెన్ స్పేస్ ఖరీదు చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలి.

● **దరఖాస్తు చేసే విధానం:** అర్జీదారులు ఎల్.ఆర్.ఎస్. పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుతోపాటు చెల్లించాల్సిన అపరాధ రుసుంలో 50 శాతం (కనీసం రూ.10 వేలు) చెల్లించాలి. వ్యక్తిగత దరఖాస్తు చేసుకోవడానికి సదరు ప్లాటు 30-06-2025 కంటే ముందు రిజిస్ట్రేషన్ జరిగి ఉండటంతోపాటు అనధికార లే అవుట్లలో భాగంగా ఉండాలి. అనధికార లే అవుట్ మొత్తం క్రమబద్ధీకరణ చేసుకోవడానికి ఒక ప్లాటు అమ్మకం 30-06-2025 కంటే ముందు జరిగి ఉండాలి. ఏక ప్లాటుగా 4000 చదరపు మీటర్ల లోపు వైశాల్యం ఉండి, పబ్లిక్ రోడ్డుకు చేరి ఉన్న స్థలాలను కూడా క్రమబద్ధీకరించుకోవచ్చు.

● **మినహాయింపులు:** నిర్ణీత కాలంలోగా అంటే 23-01.2026 లోపు దాఖలు చేసిన దరఖాస్తులకు మాత్రమే చెల్లించాల్సిన 14 శాతం ఓపెన్ స్పేస్ ఖరీదులో 50 శాతం మినహాయింపు ఇస్తారు. అనగా 7 శాతం చెల్లిస్తే సరిపోతుంది. దరఖాస్తుతోపాటు చెల్లించింది పోను మిగిలిన అపరాధ రుసుం 08-09-2025 లోపు చెల్లిస్తే మొత్తం అపరాధ రుసుంలో 10 శాతం, 23-01-2026 లోపు చెల్లించినచో అపరాధ రుసుంలో 5 శాతం మినహాయింపు ఇస్తారు.

● **క్రమబద్ధీకరణ వల్ల కలిగే ప్రయోజనాలు:** క్రమబద్ధీకరించబడిన స్థలంలో ఏవిధమైన ఇతర అదనపు చార్జీలు లేకుండా భవన నిర్మాణ అనుమతులు లభిస్తాయి. ప్లాను అనుమతి ఉంటే బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉంటుంది. భవిష్యత్తులో న్యాయబద్ధంగా విక్రయించుకోవచ్చు. క్రమబద్ధీకరించబడిన స్థలానికి చట్టపరమైన భద్రత ఉంటుంది.

● **సూచనలు:** పీకేఎం ఉడా కార్యాలయంచే అనుమతించబడిన లైసెన్సుడ్ సర్వేయర్లు, ఇంజనీర్లు, లైసెన్స్‌డ్ స్ట్రక్చరల్ ఇంజినీర్లు, ఆర్కిటెక్టులచే మాత్రమే అనధికార లే అవుట్‌లో ఉన్న స్థలాలకు ప్లాన్లు తయారు చేసుకోవాలి. అపరాధ రుసుంలో 50 శాతం (కనీసం రూ.10 వేలు) చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పీకేఎం ఉడా కార్యాలయ సిబ్బంది సదరు అనధికార లే అవుట్ స్థలాన్ని తనిఖీ చేసి, ఐపీఎల్‌పీ లే అవుట్ ఆమోదించిన తర్వాత మిగిలిన 50 శాతం రుసుంతోపాటు 7 శాతం ఓపెన్ స్పేస్ ఖరీదు చెల్లించాక స్థలాలను క్రమబద్ధీకరిస్తారు.

● **చర్యలు:** 23-01-2025 లోపు దరఖాస్తు చేయని అనధికార లే అవుట్ల స్థలాలలో భవిష్యత్తులో ఏవిధమైన భవన నిర్మాణ అనుమతులు ఇవ్వబడవు. కాదని నిర్మాణాలు చేస్తే, చట్టపరమైన చర్యలతో కూల్చేస్తారు. క్రమబద్ధీకరణ చేసుకోని అన్ని లే అవుట్ల, ప్లాట్ల వివరాలను క్రయవిక్రయాలకు వీలులేకుండా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో నిషేధిత భూముల రిజిస్టర్‌లో నమోదు చేస్తారు.

స్వచ్ఛ గ్రామాలే ప్రభుత్వ లక్ష్యం


ఈ-ఆటోలకు పూజలు చేస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గంలో అన్ని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, అంజనేయరెడ్డి తెలిపారు. రామకుప్పం మండలంలోని పంచాయతీలకు కొత్తగా మంజూరైన 23 ఈ-ఆటోలకు వారు పూజలు చేసి ఆయా పంచాయతీలకు అప్పగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వందశాతం పారిశుధ్యం సాధించాలన్న ప్రభుత్వ సంకల్పానికి ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మురళీధర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహ్మద్‌రఫీ, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ, మండల అధ్యక్షులు చలపతి, బాబు, ఎస్టీసెల్ జిల్లా, నియోజకవర్గ అధ్యక్షులు కృష్ణానాయక్, నరసింహులు, జనసేన మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు హరీష్, భాస్కర్, రెస్కో, ఏఎంసీ డైరెక్టరు మనోహర్, విజయ్‌కుమార్, పవన్‌కుమార్, మునీంద్ర నాయక్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి


నడింపల్లె పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవర్చుకోవాలని సోమల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అమరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం నడింపల్లె పాఠశాల, ఎల్లమ్మదేవత కమ్యూనిటీ భవనం ఆవరణలో పలు రకాల మొక్కలను నాటారు. అలాగే పలు మొక్కలను రైతులకు పంపిణీ చేశారు. మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్, సర్పంచి వెంకటరమణ, సీతారామయ్య, ఎన్ఎస్ఎస్ పీవో గౌతం, అధ్యాపకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఈ-సైకిళ్ల కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం

రామకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలంలో ఈ-సైకిళ్ల కోసం లబ్ధిదారుల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు వెలుగు మండల ఏపీఎం శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పుణేకు చెందిన ఇన్సోడాప్ సంస్థ సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కడా పీడీ వికాస్‌మర్మత్ వినతి మేరకు కుప్పం నియోజకవర్గంలోని ప్రజలకు రూ.34,999 విలువైన ఈ-సైకిల్‌ను రూ.23,999 లకే అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు మొత్తం నగదు ఒకేసారి చెల్లించి ఈ-సైకిల్ పొందొచ్చని ఆయన తెలిపారు. లేని పక్షంలో రూ.5000 డౌన్‌పేమెంట్ చెల్లించి మిగిలిన మొత్తం బ్యాంకులోన్ తీసుకుని వాయిదాల పద్ధతిలో చెల్లించే సదుపాయం ఉంటుందన్నారు. లబ్ధిదారులు ఎంపిక ప్రక్రియ సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రారంభమైనట్లు ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిధి మణీంద్రం, సింగసముద్రం, 89పెద్దూరు గ్రామసచివాలయాల్లో లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. ఈనెల 3న చెల్దిగానిపల్లె, బందార్లపల్లె-1, నారాయణపురంతండా, 4న ననియాలతండా, రామకుప్పం-2, ముద్దనపల్లె, 5న విజలాపురం, బల్ల, కెంచనబల్ల, 6న బైపరెడ్లపల్లె, ఆనిగానూరు, కొంగనపల్లె, పీఎంకేతండా, పంద్యాలమడుగు, 8న గొరివిమాకులపల్లె, వీర్నమల, రామకుప్పం-2, బందార్లపల్లె-2 సచివాలయాలు, గ్రాపంచాయతీ కార్యాలయాల్లో ఆసక్తిగల అభ్యర్థులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

నారా లోకేశ్‌ను కలిసిన రామకుప్పం నేత



రామకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసుల విషయంలో బాధితులకు అండగా ఉంటామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. సోమవారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను తాను కలిశానని రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీ మాజీ సర్పంచి మహాదేవి భర్త, కుప్పం డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జయశంకర్ తెలిపారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్నామన్న కక్షతో తనపై తన కుటుంబంపై అక్రమంగా 42 కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేశారని ఆయన దృష్టికి తీసుకెళ్లానని ఆయన తెలిపారు. అక్రమ కేసుల విషయంలో తమకు న్యాయం చేయాలని మంత్రిని కోరానని ఆయన చెప్పారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేశ్ అక్రమ కేసులపై ఎవరూ అధైర్యపడొద్దని, పార్టీ అండగా ఉండి విముక్తి కలిగిస్తుందని భరోసా ఇచ్చారని జయశంకర్ తెలిపారు.

గడ్డూరులో ఎన్ఎస్ఎస్ సేవలు



అవగాహన కల్పిస్తున్న దంతవైద్యులు భరత్‌కుమార్

పలమనేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు మంగళవారం గడ్డూరు గ్రామంలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. నాలుగో రోజు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు దంతవ్యాధులు, దంత రక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలమనేరుకు చెందిన ప్రముఖ దంత వైద్యులు భరత్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆర్.వెంకటేష్‌బాబు, అధ్యాపకులు రవీంద్రనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సరస్వతి, అధ్యాపకురాలు డాక్టర్ రుక్మిణి, శశికళ, సుదర్శన, ఐక్యూ కోఆర్డినేటర్ డాక్టర్.ఎస్.బెనజీర్ పాల్గొన్నారు.

ఆలయ స్థలం, గదులకు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

పలమనేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయానికి సంబంధించిన స్థలం, మూడు గదులకు మంగళవారం దేవాదాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. వేలంతో ఏడాదికి రూ.8.81 లక్షల మేర ఆలయానికి ఆదాయం సమకూరింది. కర్నూలు దేవాదాయ శాఖ ఉపకమిషనర్ పి.గురుప్రసాద్, చిత్తూరు సహాయ కమిషనర్ కె.చిట్టెమ్మ, మదనపల్లి డివిజన్ దేవస్థాన కార్యనిర్వహణ అధికారి కె.కమలాకర్, ఆలయ కమిటీ సభ్యులు ఆర్.మురళీ, ఆలయ అర్చకులు, ఎండోమెంట్ సిబ్బంది విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రజారోగ్యమే ప్రధానం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

శాంతిపురం, డిసెంబరు 2 : ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే పల్లెల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించామని ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన శాంతిపురంలో ఈ-ఎలక్ట్రికల్ ఆటోలను పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో ఏవీఆర్ కుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు నందిగం ఉదయకుమార్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండలంలోని 23 పంచాయతీలకు కోటి రూపాయలు విలువ చేసే 23 ఈ-ఆటోలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచితేనే ప్రజల ఆరోగ్యం సాధ్యమని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఇంటింటా పొడి తడి చెత్తను వేర్వేరుగా సేకరించి బృందావనాల్లో సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపాల్, రెస్కో డైరెక్టర్లు బసవరాజు, అనసూయ, చలపతి, ఏఎంసీ డైరెక్టర్లు హరినాథరెడ్డి, చంద్రకళ, శ్యామల, క్లస్టర్ ఇన్‌చార్జిలు పీవీ నాగరాజు, రాజేంద్ర, యూనిట్ ఇన్‌చార్జిలు, టీడీపీ నేతలు జయారెడ్డి, మణి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో ఆన్‌లైన్ సేవలు

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు ప్రతి అర్జీని ఆన్‌లైన్ నమోదు చేయాలని ఎంపీడీవో జీవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం వల్లిగట్ల, కందూరు సచివాలయాలను సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ ఆదాయ వనరుల కోసం ఇంటి పన్నుల వసూళ్లను సమీక్షించారు. వర్షాకాలంలో వీధుల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యదర్శులు జయశంకర్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

సోమల డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసులురెడ్డి

సోమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోమల మండలానికి నూతన డిప్యూటీ ఎంపీడీవోగా శ్రీనివాసులురెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం సోమల 1, ఇరికిపెంట సచివాలయాలను సందర్శించి ఉద్యోగులతో పలు అంశాలపై సమీక్షించారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సి జాగ్రత్తలు, ప్రజల నుంచి అందే వినతులు స్వీకరించి క్షేత్రస్థాయి సందర్శనలతో వాటిని పరిష్కరించాలన్నారు. హౌసింగ్ ఏఈ మణికంఠ, కార్యదర్శులు విశ్వమాలిని, మేనక, వీఆర్వో లోకనాథం పాల్గొన్నారు.

మాతా శిశు మరణాలు నివారించాలి


మాట్లాడుతున్న వైద్యశాఖ గణాంకాల అధికారి జార్జ్

చౌడేపల్లె, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని వైద్య శాఖ జిల్లా గణాంకాల అధికారి జార్జ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చౌడేపల్లె పీహెచ్‌సీ, గడ్డంవారిపల్లె, కాగతి, 29 ఏ చింతమాకులపల్లె విలేజ్ క్లినిక్‌లను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీపీవో రామ్మోహన్, డాక్టర్ మోనా, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబులు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 86 మందికి రూ.68.60 లక్షలు విలువ చేసే నగదు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడా పీఏసీ సభ్యుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్ జిమ్ దాము, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్తకు నివాళులు


నివాళులర్పిస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మార్వాడ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త సింగిరి వెంకటేశ్ అనారోగ్య కారణాలతో మంగళవారం మృతి చెందారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్. మునిరత్నం, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజగోపాల్ తదితరులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పుంగనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పరిసరాలతోపాటు ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవడంతో ఆరోగ్యవంతులుగా ఉండగలరని పుంగనూరు ప్రభుత్వ జూనియర్ బాలికల కాలేజీ ఎన్ఎస్ఎస్ అధికారి శ్రావణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక భగత్‌సింగ్ కాలనీలో అగ్నిమాపక అధికారులు, సిబ్బందితో కలిసి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్‌నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల, జవహర్ తదితరులు

కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆస్పత్రిలో మంగళవారం ఆధార్, సంజీవని కేంద్రం, చిన్నపిల్లల మానసిక ఎదుగుదల కేంద్రాలను, పీఈఎస్ ఆయన ప్రారంభించారు. కడా పీడీ వికాస్ మర్మత్, కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి త్రిలోక్, పీఈఎస్ చైర్మన్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామిలతో కలిసి ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ టాటా సంజీవని కేంద్రం నియోజకవర్గంలోని ప్రజల ఆరోగ్య రికార్డు ఆన్‌లైన్‌లో నమోదవుతుందన్నారు. తద్వారా దేశంలో ఎక్కడకు వెళ్లినా సత్వర వైద్య సేవలు వారికి అందుతాయన్నారు. పీఈఎస్ ఆస్పత్రి పేద ప్రజలకు చేస్తున్న ఆరోగ్య సేవలను ప్రశంసించారు. పీఈఎస్ చైర్మన్ జవహర్ దొరస్వామి మాట్లాడుతూ ప్రజారోగ్య వ్యవస్థను బలోపేతం ఏయడంలో, ఆస్పత్రి సంరక్షణ నాణ్యతను పెంచడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మద్దతుతో తాము ఎన్నో కార్యక్రమాలకు రూపకల్పన చేస్తున్నామన్నారు. రోగుల ఆధార్ ఆధారిత ధ్రువీకరణ కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. అలాగే టాటా సంజీవనీ కేంద్రం ద్వారా అన్ని రెఫర్ చేయబడిన రోగుల ఆరోగ్య సంరక్షణ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయన్నారు. చిన్నపిల్లల మానసిక ఎదుగుదల కేంద్రం ద్వారా పిల్లల మానిసక ఆరోగ్య పరిరక్షణ సులభతరం అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పీఈఎస్ విద్యాసంస్థల ఈవోవో అజయ్ కుమార్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి, అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రూపా సురేశ్, డాక్టర్ భరత్ సురేశ్, డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావవు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రహ్మణ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ర్యాలీ సుబ్బారావు, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నాగకిరణ్, డాక్టర్ మోహన్‌రూప, చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర నాయుడు, వివిధ విభాగాధిపతులు, వైద్య విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవని మహిళా సంచిక ఆవిష్కరణ



కుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కమిషనర్ వి.శ్రీనివాసరావులతో కలిసి అవని మహిళా సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు స్వయం ఆర్థిక శక్తులుగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఆయా పథకాలను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, మెప్మా మహిళలు, కౌన్సిలర్లు జిమ్ దాము, సోము, ఎమ్మార్ సురేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, టీడీపీ నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకిర్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణితంపై పట్టుసాధిస్తే అన్నీ విజయాలే



పుంగనూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గణితంపై విద్యార్థులు పట్టుసాధిస్తే వారికి జీవితంలో అన్నీ విజయాలే చేకూరుతాయని గణిత అష్టావధాని హసనాపురం అరుణ్ శివప్రసాద్ అన్నారు. మంగళవారం పుంగనూరు జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గణితబ్రహ్మ లక్కోజు సంజీవరాయశర్మ వర్ధంతి సందర్భంగా 49వ గణిత అష్టావధాన కార్యక్రమం జరిగింది. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్, సంజీవరాయ శర్మల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణిత అష్టావధాని అరుణ్‌శివప్రసాద్, గణిత ఉపాధ్యాయులను శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రుద్రాణి, గణిత ఉపాధ్యాయులు ఎన్.నారాయణ, ప్రభాకర్ రావు, మునిలక్ష్మీ, జీవలత, గాయిత్రి, అనిత, తులసి, మీనాకుమారి, చాముండేశ్వరి, ఉపాధ్యాయులు జీవీ.రమణ, వెంకటపతి, రామలింగప్ప, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం చేయాలి

- తహసీల్దార్ కాళ్లు పట్టుకున్న నేత


మోకాళ్లపై నిలబడిన దళిత నాయకుడు రాజన్న

పుంగనూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దళిత సంఘ నాయకుడు రాజన్న పుంగనూరు తహసీల్దార్ రాము కాళ్లు పట్టుకుని విన్నవించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో దళిత సంఘ నాయకుడు రాజన్న మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా దళితులకు శ్మశానాలు చెరువులు, కుంటలు, వంకలు, వాగుల్లోనే ఉన్నాయని.. ప్రస్తుతం వర్షాలు కారణంగా అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళితులకు శ్మశానాలు ఏర్పాటు చేయాలని, స్థలం లేకపోతే భూసేకరణ చేపట్టాలని జీవో ఇచ్చినా తమ సమస్య తీర్చాలని అధికారులను కోరినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా శ్మశానాలకు అవసరమైన స్థలాలు కేటాయించాలని కోరుతూ తహసీల్దార్ కాళ్లు పట్టుకోగా .. తహసీల్దార్ వద్దని వారించి త్వరలోనే శ్మశానాలకు స్థలాలు గుర్తించడానికి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ పలు సమస్యలను తెలిపారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ మహేశ్, ఎస్ఐ వెంకటరమణ, ఎంవీఐ సుప్రియ, దళిత సంఘ నాయకులు రామయ్య, జీవనజ్యోతి, వెంకటరమణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

కుప్పం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం అన్నారు. కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు చంద్రన్న హౌసింగ్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటి పట్టాలతోపాటు నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ఎం.రాజగోపాల్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

టీడీపీ పూర్వ వైభవానికి ప్రత్యేక చర్యలు


సమావేశమైన టీడీపీ నేతలు

వి.కోట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెర్నపల్లె పంచాయతీ పరిధిలో టీడీపీ బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం నెర్నపల్లె పంచాయతీలో పంచాయతీ ముఖ్యనేతలతో సమీక్షించారు. పార్టీ పరిస్థితిపై పరిశీలకులుగా వచ్చిన ప్రేమ్‌కుమార్ నేతలతో చర్చించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చౌడప్ప, మండల పార్టీ అధ్యక్షులు బి.ఆర్.రాంబాబు, ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, పీఏసీఎస్ అధ్యక్షులు నారాయణస్వామి, యూనిట్ ఇన్‌చార్జులు విశ్వనాథ్, శబరీష్, జనార్దన్‌రెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షులు రమేష్, నేతలు నాగరాజు, మహదేవన్, చలపతి, కృష్ణరాయప్ప, వెంకట్రామప్ప, రాము తదితరులు పాల్గొన్నారు.

తిరుపతికి వెళ్లి పింఛను అందజేత



రామకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సింగసముద్రం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన సాలమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఆమె తిరుపతి నారాయణాద్రి ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకుని అక్కడే అడ్మిట్‌లో ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరమణ, కామరాజనాయక్‌లు ఎంపీడీవోతో చర్చించి ఆమెకు ఈ నెల పింఛను మొత్తం అందేలా చర్యలు తీసుకున్నారు. మంగళవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్‌బాబు టీడీపీ నేతలతో కలిసి తిరుపతికి వెళ్లి సాలమ్మ కుమారుడు సుబ్రహ్మణ్యంకు పింఛను మొత్తాన్ని అందజేశారు.

ఈమార్గంలో నిత్యం ట్రాఫిక్ చిక్కులే..



కార్వేటినగరం రోడ్డులో వాహనాలు ఎదురుపడితే ట్రాఫిక్ ఇబ్బందే

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో ఉన్న కార్వేటినగరంలో రోడ్డుకు ఇరువైపులా దుకాణదారుల ఆక్రమణతో స్థలం కుచించుకుపోయింది. దీనికితోడు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి చెరకు ట్రాక్టర్లు, లారీలు ఇదే మార్గంలో వెళ్తుంటాయి. దీంతో ప్రధాన మార్గం ఇరుకుగా తయారైంది. ఫలితంగా తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. నియోజకవర్గం కేంద్రం కూడా కావడంతో ప్రాధాన్యత గుర్తించి చొరవ చూపి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే థామస్‌ను ప్రజలు కోరుతున్నారు.

ఖాళీ గదులను హోమ్ స్టేలుగా వాడితే మేలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 2 ఆంధ్రజ్యోతి):ఇళ్లలో ఖాళీ గదులను హోమ్ స్టేలకు అద్దెకు ఇవ్వడం వలన లాభం కలుగుతుందని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు.సోమవారం కాణిపాకంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో పర్యటక శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హోమ్ స్టేకి రాష్ట్ర ప్రభుత్వం వివిధ రాయితీలను అందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి హోమ్ స్టేను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మణినాయుడు, నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ కన్వీనర్ గిరిధర్‌బాబు, మాజీ సర్పంచ్ మధుసూదనరావు,జిల్లా పర్యాటక శాఖ అధికారి నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ బాధితులకు చేయూత

నగరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అవగాహనతో ఎయిడ్స్ వ్యాధిని అరికట్టవచ్చని స్టెప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ప్రమీలమ్మ పేర్కొన్నారు. దేశమ్మగుడి సమీపంలో మంగళవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఆర్‌టీ మందు వాడుతూ పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పది మంది ఎయిడ్స్ బాధితులకు నిత్యావసర సరకులు, బెడ్‌షీట్లు, పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్టెప్స్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రప్రదేశ్): టీడీపీ కార్యకర్త మృతికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు నాయుడు, టీడీపీ నేతలు నివాళులర్పించారు. స్థానిక చెన్నమగుడిపల్లికి చెందిన వినోద్ సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మంగళవారం మృతదేహానికి చెన్నకేశవులు నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మట్టి ఖర్చులకు రూ.30 వేలు అందించారు. పార్టీ తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

IN THE COURT OF THE ADDL., CIVIL JUDGE, CHITTOOR (SENIOR DIVISION)
I.P.No.38 OF 2025

Between
N.K.Thyagarajulu S/oLate N.C.Koti Chetty,residing at D.No.12/513A,Swamy Reddy Street back side Nimmandakara Street, Chittoor Town and District ...Petitioner
And
S.Radhakrishna & 27 others ...Respondents

NOTICE TO RESPONDENTS 1 TO 28 AND GENERAL NOTICE TO PUBLIC

1) **S.Radhakrishna,** S/o S.Ramakrishnaiah,Business, residing at Vellore Road, Greamspet, Chittoor.
2) **Nanda Gopal,** S/o Pandurangaiah Chetty, Proprietor of Nandagopal Traders,Business, residing at Door No.11-237, Bazaar Street, Chittoor.
3) **P.L.Mallikarjuna**. S/o P.Lakshmaiah, Business, residing at Door No.13-267, Bazaar Street, Chittoor.
4) **Kanakarajulu,** S/o Narasimhulu Chetty, Business, residing at C/o Nagaraja Store, Elama Street, Santhapet, Chittoor Town
5) **Radhakrishna,** S/o Ramaiah chetty, Cloth Merchant, residing at Thavanampalli Village and Mandal, Chittoor District.
6) **Ravi Kumar,** S/o Ramana, Business, residing at C/o Ravi General store, Ponniamman Koil Street, Old Bus stand (near) Teja Sweets), Chittoor Town.
7) **P.Harinadh,** S/o Dwarakanatha Chetty, Business, residing at 12-494, Swamy Reddy Street, Chittoor Town and District.
8) **Potti Dayananda Gupta**, S/o Madhusudhan, Business, residing at Swamy Reddy street, near Old Market, Chittoor Town.
9) **P.R.Venugopal,** S/o P.Radhakrishnaiah Chetty, Business, residing at V.M.Traders, D.No.16-45, Church Street, Chittoor
10) **P.R.Muralikrishna,** S/o P.P.Radhakrishna, Business, residing at Old Market Street, Chittoor.
11) **S.Daya @ Dayananda,** S/o Devendra, Business, Proprietor, Daya General Stores, Ponniamma Koil Street, Chittoor.
12) **Chaluvadhi Nageswara Rao**, S/o Venkataramaiah Chetty, C/o Dall Mill, Industrial Estate, residing at Nippo Battery, Nellore.
13) **Sri. Raja General Store**, represented by its proprietor, Rajasekhar, near Selvam Oil Stores, Church Street, Chittoor Town.
14) **A.Jana** S/o A.Mallikarjuna Chetty, residing at Vepamanu Street, Chittoor.
15) **T.K.Kamal,** S/o T.S.Krishnamurthy, General Merchant, residing at Church Street, Chittoor.
16) **R.Chandra Sekhar,** S/o Sitaramaiah Chetty, Business, residing at Vysya Street, Chittoor.
17) **O.R.Manohar Chetty,** S/o O.Rangamannar, Business, residing at Old Market Street, Chittoor,
18) **N.R.Anandan**, S/o N.R.Radhakrishna, Business, residing at Door No.16-48, Church Street, Opposite B.Z.High School, Chittoor Town.
19) **Divya Finance Corporation**, rep. by its Manager, Pathi Rajeskhar, Chittoor, Business, residing at Church Street, Upstairs, Opp. Selvam Store, Chittoor.
20) **Smt.Vanajakshi**, W/o Late Seshadri, Business, residing at C/o D.Govindarajulu, S/o Kannaiah Chetty, residing at Near E-seva, Indira Nagar, Santhapet, Chittoor Town.
21) **Smt.Uma,** W/o S.Ravindran, Business, residing at Pannakkara Theruvu, Ambur, Vellore District (Tamil Nadu)
22) **D.Sreena,** S/o D.Kannaiah Chetty, Business, residing at Virat Cloth Merchant, Church Street, Chittoor.
23) **S.Dhanapal Chetty,** S/o Devendra Chetty, Sabari Finance Business, residing at Bazaar Street, Pakala.
24) **Mangalam Finance Corporation**, rep. by its owner by name B.R.Rajasekhar, Business, residing at Long Bazaar, Mandi Street, Vellore (Tamil Nadu).
25)**Smt.Kalpana,** W/o Hariprasad,Business, residing at Care of DTDC Courier Service, Palamaner,Chittoor Dist.
26) **Murthy**, S/o Munirathnam Chetty, Business, Jaggery Merchant and Finance, residing at E-seva, Care of Govindarajulu, Indira Nagar, Santhapet, Chittoor.
27)**S. Prabhavathi,** W/o Late Siva Prakasan, Business, residing at 28 VVC Nagar, Housing Unit Road, Nehru Nagar East, Coimbatore-641048, (Tamil Nadu)
28)**N.K.Sujatha,** W/o Late N.K.Kupparaju, residing at 12-513, Swamy Reddy Street, Chittoor.

Sirs/Madams, Please take notice that the petitioner has filed above IP against you to declare him as an Insolvent. The said IP is posted to **08.01.2026** for your appearance. Hence, Respondents Nos.1 to 28 of you and General Public i.e if any one has lent the money to the Petitioner please be present on the said date before the said court on **08.01.2026 at 10.30 a.m.**, either in person or through an Advocate and file your objections if any, failing which the matter will be decided in your absence as ex-party.
Hearing Date : **08.01.2026**

Place: Chittoor, Sd/- **SRI V.SREERAMULU NAIDU**
Date: 02.12.2025 Advocate for petitioner

ఆటోను ఢీకొన్న బస్సు

● ఒకరికి తీవ్ర గాయాలు



పూర్తిగా దెబ్బతిన్న ఆటో - గాయపడిన ఆటో డ్రైవర్

గుడిపాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేలూరు-చిత్తూరు జాతీయ రహదారిలో మంగళవారం తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వేలూరు నుంచి చిత్తూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు గుడిపాల సమీపాన రోడ్డు దాటుతున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఇతడ్ని చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గుడిపాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని మహాత్మ జ్యోతిరావు పూలే భవన్‌లో బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ సంచాలకులు విక్రమ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విభిన్న ప్రతిభావంతుల కోసం పనిచేస్తున్న సంఘాలు, సేవా సంస్థలతో పాటు విభిన్న ప్రతిభావంతులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొంటారన్నారు.

అఖండ చిత్ర త్రిశూలానికి పూజలు



త్రిశూలం, జగన్‌తో బాలకృష్ణ అభిమానులు

నగరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న అఖండ-2 చిత్రం దిగ్విజయం సాధించాలని కంచిలోని శివాలయంలో పూజలు చేయడానికి వెళుతున్నట్లు అఖిల భారత బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు అనంతపురం జగన్ తెలిపారు. కంచి వెళుతూ బుధవారం నగరిలో కాసేపు ఆగారు. ఈసందర్భంగా నగరిపేట గ్రామ బాలకృష్ణ అభిమానులు చలపతి ఆధ్వర్యంలో జగన్‌ను కలిశారు. అఖండ చిత్రంలో బాలకృష్ణ ఉపయోగించిన త్రిశూలానికి, ఢమరుకానికి పూజలు చేశారు. జగన్‌ను పూలమాలతో సత్కరించారు. చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జైన్ సంఘం దుస్తుల వితరణ

చిత్తూరు సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎనిమిది కేజీబీవీలకు జైన్ సంఘం ఆధ్వర్యంలో ఆసంఘం అధ్యక్షుడు సుభాష్ జైన్ 312 జతల దుస్తులను అందజేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అధికారులకు వీటిని అందించారు. ఈ సందర్భంగా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మద్దిపట్ల వెంకటరమణ సుభాష్ జైన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'వైసీపీ నేతల సంతకాల సేకరణ డ్రామా'

గంగాధరనెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలు చేపట్టిన కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం పెద్ద డ్రామాలాగా ఉందని జిల్లా తెలుగుయువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు విమర్శించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను పీపీపీ పద్ధతిలో పూర్తిచేసి అన్నివర్గాల ప్రజలకు వైద్యవిద్య అందించాలని సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేకశ్రద్ధ వహించారన్నారు. అధికారంలో ఉన్నపుడు వైసీపీ ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని గాలికొదిలేసిందన్నారు. ఆ పార్టీ నాయకుల నాటకాలను ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరన్నారు.

ప్రతి మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కారం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి మంగళవారం విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆవలకొండ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ తనిగవేలు చెప్పారు. ఎస్‌ఈ ఆదేశాల మేరకు తూగుండ్రం,దళితవాడల్లో ఆయన సిబ్బందితో కలిసి పర్యటించారు. ఏఈ మాట్లాడుతూ ఉదయం మార్నింగ్ వాక్ తరహాలో తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి సిబ్బందితో సరిచేయిస్తున్నామన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు వుంటే సమాచారం తెలియజేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. పార్లమెంట్ టీఎన్‌టీయుసి అధికార ప్రతినిధి జీవరత్నం, నీరజాక్షులురెడ్డి, రాఘవేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం కలేనా?



డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో వైఎస్ విగ్రహం (ఫైల్ ఫొటో)

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కలగానే మిగులుతోంది. దూరాన ఉన్న జూనియర్ కాలేజిలోనే డిగ్రీ విద్యార్థులు అవస్థల నడుమ సర్దుకుపోతున్నారు. 2020లో గత వైసీపీ ప్రభుత్వం డిగ్రీ కళాశాల మంజూరు చేసింది. అదే ఏడాది చవటగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే ఈ కాలేజి తరగతులను తాత్కాలికంగా ప్రారంభించారు. ఉదయం జూనియర్, తర్వాత డిగ్రీ కళాశాల తరగతులను నిర్వహిస్తున్నారు. జూనియర్ కళాశాల భవనంలోనే ఇప్పటికీ డిగ్రీ కాలేజిని నెట్టుకొస్తున్నారు. కనీస వసతుల కొరత వెంటాడటం, మరోపక్క సర్దుబాటు సమస్య వల్ల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయని సమాచారం. నాటి వైసీపీ పాలనలో డిగ్రీ కాలేజి శాశ్వత భవన నిర్మాణానికి కొమరగుంటలో 8ఎకరాలకు పైగా స్థలాన్ని కేటాయించింది. నిధులూ మంజూరు చేస్తున్నట్లు అప్పటి పాలకులు ప్రకటించారు. నాలుగేళ్లు దాటుతున్నా పునాది రాయి మాత్రం పడలేదు. విశేషమేమిటంటే కేటాయించిన స్థలంలో వైఎస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. భవన నిర్మాణ పనుల విషయంలో మాత్రం ఆసక్తి చూపలేదు. ఎమ్మెల్యే థామస్ చొరవ తీసుకుని సొంత భవన వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

మామిడి రైతు సంఘం నేతగా చెంగల్రాయరెడ్డి

పూతలపట్టు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల మామిడి రైతుల సంఘం గౌరవాధ్యక్షుడిగా చెంగల్రాయరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మునీశ్వరరెడ్డి, కార్యదర్శి బంగారం మురళీల ఆధ్వర్యంలో ఈమేరకు ఎన్నుకున్నారు. సలహాదారులుగా భారతి, అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలయ్య నాయుడు, ఉపాధ్యక్షులుగా ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా దశరథరామిరెడ్డి, మునిరత్నంరెడ్డి, జయచంద్రన్, కోశాధికారిగా దొరబాబురెడ్డి, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అంత్యక్రియలకు వాగు దాటాల్సిందే..



శ్రీరంగరాజపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వానాకాలంలో ఎవరైనా మరణిస్తే అక్కడి ప్రజలకు క్లిష్టపరిస్థితి ఎదురవుతుంది. మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించాలంటే వాగు దాటి వెళ్లాల్సిందే. మర్రిపల్లి కాలనీవాసులకు సోమవారం ఇలాంటి ఇబ్బందే తలెత్తింది. కాలనీకి చెందిన గుజ్జేరయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సోమవారం మృతదేహాన్ని వాగు నీటి నుంచి శ్మశానానికి తీసుకువెళ్లడానికి అష్టకష్టాలు పడాల్సి వచ్చింది. వర్షాకాలంలో వాగులో నీరు చేరుతుంది. శ్మశానానికి దారి వసతి కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

దళితవాడలో ప్రాథమిక వసతుల జాడేదీ?



రోడ్లు దెబ్బతిన్నాయిలా..

చిత్తూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుమ్మింద దళితవాడవాసులు నిత్యం సమస్యలతో సతమతమవుతున్నారు. ఇక్కడ సుమారు 500 మందికి పైగా కుటుంబాలు ఉంటున్నాయి.కాలనీలో అడుగు పెడితే మొండి గోడలు, పూతపనికానీ ఇళ్లు, అసంపూర్తి నిర్మాణాలు కనిపిస్తాయి. ఏళ్ల క్రితం వేసిన రోడ్డే ఇప్పటికీ. ఇది పూర్తిగా ధ్వంసమైంది. సుమారు పది వీధుల్లో చూద్దామంటే మురుగు కాలువ కనిపించదు. ఎక్కడ చూసినా మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తుంటుంది. దోమలు వృద్ధి చెందుతున్నాయి. విషపురుగులు ఇళ్లలోకి చేరుతున్నాయి.. గతేడాది ఇదే సీజన్‌లో సగం మంది డయేరియా బారిన పడి ఆస్పత్రి పాలయ్యారు. పది రోజుల పాటు శిబిరాలు ఏర్పాటుచేస్తే తప్ప పరిస్థితి అదుపులోకి రాలేదు



ఇళ్ల పక్కనే మురుగు నీరు నిల్వ

పలమనేరు రోడ్డులో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో రోడ్డు అభివృద్ధి పనులు వేగమందుకున్నాయి. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాల మేరకు ఈపనులపై ప్రత్యేక శ్రద్ధకనబరుస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం దర్గా సర్కిల్ నుంచి ఇరువారం వరకు విస్తరణలో భాగంగా పలమనేరురోడ్డుపై వివిధ రకాల ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. నగరపాలక సంస్థ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో ఎక్సవేటర్ సాయంతో అనధికార నిర్మాణాలను తొలగించారు. రోడ్డు విస్తరణ పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏసీపీ తెలిపారు.

నేడు ఆలయాల్లో కార్తిక దీప మహోత్సవం



కార్తిక దీప మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సప్తకన్నికల ఆలయ ప్రతినిధులు

చిత్తూరు కల్చరల్, డిసెంబరు2: నగరంలో బుధవారం పలు ఆలయాల్లో తమిళ కార్తికమాస దీప మహోత్సవం నిర్వహించనున్నారు. మంగళవారం ఈమేరకు దొడ్డిపల్లె సప్త కన్నికల ఆలయ ఈవో వెంకట్రాయలు, పాలకమండలి ఛైర్మన్, ఏపీ మొదిలియార్ సంఘం డైరెక్టర్ గోపాలకృష్ణ బృందం,ఎక్స్ అఫిషియో సభ్యుడు నళినీ తిరుకుమరన్, టీడీపీ ఇన్‌చార్జ్ తిరుకుమరన్‌లు కార్తీక దీప మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. స్థానిక గుర్రప్ప నాయుడు వీధీ అంకాల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో అఖండ దీప ప్రదర్శన నిర్వహించి , సాయంత్రం మహాదీపం వెలిగించనున్నారు. గిరింపేట సుబ్రమణ్యేశ్వర, చిదంబరేశ్వర, పొన్నియమ్మ గుడి, అగస్థీశ్వర, కట్టమంచి కులందేశ్వరుడితో పాటు పలు ఆలయాల్లో కార్తీక దీప వేడుకలు నిర్వహించనున్నారు.

బూత్ స్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి కృషి



మణినాయుడిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పెనుమూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఆ పార్టీ పరిశీలకుడు ,కాణిపాకం ఆలయ చెర్మన్ మణినాయుడు కోరారు. మండలంలో పార్టీ బలపడటానికి తీసుకోవలసిన చర్యలపై మంగళవారం మోపిరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయంలోఆయన పార్టీ నాయకులతో మాట్లాడారు. శ్రేణుల అభిప్రాయాలను సేకరించి పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదించారు. కలిగిరి పంచాయతీలో గిరిధర్‌నాయుడు సమీక్ష నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షులు రుద్రయ్యానాయుడు, కర్నాల అరుణ, తలారిరెడ్డెప్ప, పరమేశ్వర్‌రెడ్డి, భాస్కర్, యువరాజులునాయుడు, అనసూయమ్మ, ప్రసాద్, జయచంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రజామోద నాయకులకే పదవులు



మాట్లాడుతున్న ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు జయకుమార్

శ్రీరంగరాజపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజామోదం ఉన్న వారికే కాంగ్రెస్‌లో అధ్యక్ష పదవులు దక్కుతాయని ఏఐసీసీ ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ జయకుమార్ అన్నారు. మంగళవారం ఎస్ఆర్‌పురంలో పార్టీ సంస్థాగత నిర్మాణ కార్యక్రమాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్త రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో జయకుమార్ మాట్లాడుతూ పార్టీ జెండాకు గుర్తింపునిస్తే కచ్చితంగా ఓ రోజు అందలాన్ని ఎక్కిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ దామోదరం, రాంభూపాల్‌రెడ్డి, పోటుగారి భాస్కర్, టిక్కీ రాయల్, గౌతంతో పాటు నాయకులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం




ఉరుస్తున్న భవనం సీలింగ్- దయనీయంగాఅంగన్‌వాడీ కేంద్రం

యాదమరి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపల్లి దళితవాడలో గత కొన్నేళ్లగా పాడుబడిన అద్దెభవనంలో అంగన్‌వాడీ కేంద్రం నడుపుతున్నారు. ఆ భవనం శిథిలావస్థకు చేరింది. అయినా అక్కడే కార్యకలాపాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను భయం భయంగా కేంద్రానికి పంపిస్తున్నారు. వర్షానికి భవనం ఉరుస్తుండడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. నూతన భవనం మంజూరైనా పునాదులకే పరిమితం కాగా, సరైన వసతులు, ఆట స్థలం కూడా కరువైందని, అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్తిక పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు

గుడిపాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రఘునాథపురంలోని పాళ్యంకొండ ఆంజనేయస్వామి కొండలో బుధవారం కార్తిక పౌర్ణమి వేడుకలకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులు అన్నప్రసాదం స్వీకరించి సాయంత్రం కార్తీకదీపం వెలిగిస్తారు. గిరి ప్రదక్షిణ చేస్తారు.

పాలసముద్రం: రాచపాళ్యంలోని బాలగురునాథీశ్వరాలయంలో కార్తీక దీపోత్సవం సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి రుద్రహోమం నిర్వహించనున్నారు. సాయంత్రం నెయ్యి దీపాన్ని వెలిగిస్తారు

ఏకాగ్రత,ధ్యానం అలవర్చుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

ఐరాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఏకాగ్రత,ధ్యానం అలవర్చుకోవాలని డైట్ లెక్చరర్ సురేష్‌బాబు సూచించారు. మంగళవారం ఆయన ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమర్సీ పరీక్ష క్రమంలో పొలకలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పిల్లల అభ్యసన స్థాయిని తరగతుల వారీగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చదువు ఒక్కటే తలరాతను మారుస్తుందన్నారు. కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరుకోవాలని హితవు పలికారు.

సుబ్రహ్మణేశ్వరుడికి పూజలు



వెదురుకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): కార్వేటినగరంలో సుబ్రహ్మణంస్వామికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. స్వామిని అలంకరించి భక్తులకు దర్శన వసతి కల్పించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామ దేవత బంగారమ్మకు విశేష పూజలు నిర్వహించారు. రాహుకాలం పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ కార్యకర్తల మృతికి సంతాపం



ఆర్ముగం మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న చినబాబు

విజయపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇళ్ళత్తూరుకు చెందిన టీడీపీ కార్యకర్త ఆర్ముగం, విజయపురం దళితవాడకు చెందిన టీడీపీ కార్యకర్త శేఖర్‌ల మృతికి ఎంఎస్ఎంఈ డైరెక్టర్ చినబాబు సంతాపం ప్రకటించారు. వారి పార్థివదేహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. మండల టీడీపీ నాయకులు చుక్కా ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, రమేష్‌రాజు, బాబుయాదవ్, మునిభాస్కర్‌రాజు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలో శిష్ట సౌందర్య వల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం నందీశ్వరునికి ప్రదోష కాల పూజలు చేశారు. సదాశివేశ్వరస్వామికి అభిషేక పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్‌రాజు, ఉపాధ్యక్షులు కృష్ణస్వామిరాజు, కార్యదర్శి మేలపూడి రాజేంద్రరెడ్డి, కార్యనిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తిరుపతి వెళ్లి పింఛను అందజేత



లబ్ధిదారు కుమారుడికి పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్, టీడీపీ నేతలు

రామకుప్పం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పెన్షన్ అందజేసిన వైనమిది. సింగసముద్రం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన సాలమ్మ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల తిరుపతిలోని ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. అక్కడే ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు వెంకటరమణ, కామరాజనాయక్‌లు ఎంపీడీవోతో చర్చించారు. ఈక్రమంలో మంగళవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్‌బాబు టీడీపీ నేతలతో కలిసి తిరుపతి వెళ్లి ఆమెకు పింఛను అందజేశారు.